క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ ఊరేగింపు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహో బిలం లక్ష్మీ నృసింహ స్వామి పల్లకీ సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత నృసింహ స్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, పల్లకీలో కొలువుదీర్చారు. మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు.

భక్తి శ్రద్ధలతో నాగుల పుట్టకు పూజలు



ట్రాన్స్‌కో కార్యాలయంలోని నాగుల పుట్టకు పాలు పోస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలో శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని నాగులపుట్టకు పూజలు చేశారు. కొర్రకోడు గుండునాగప్ప స్వామి, ముద్దలాపురం, కూడేరు, అంతరగంగ, మరుట్ల, బ్రాహ్మణపల్లి, ఇప్పేరు, జల్లిపల్లి, ఉదిరిపికొండ, కరుట్లపల్లితో పాటు మరికొన్ని గ్రామాల్లోని నాగుల పుట్టలకు, ప్రతిమలకు పూజలు చేశారు.

వజ్రకరూరులో 52.0 మి.మి. వర్షం



వజ్రకరూరు సమీపంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు

వజ్రకరూరు: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 52.0 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదు అయినట్లు వీఆర్వో భరత్‌కుమార్ శనివారం తెలిపారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షానికి వాగులు,వంకలు పొంగి పొర్లాయి. వజ్రకరూరులోని మెయిన్‌బజార్ నుంచి చెట్టుకుంటవైపు వర్షపు నీరు పెద్ద ఎత్తున పారింది. భారీ వర్షంతో వజ్రకరూరు పరిసర ప్రాంతంలోని పొలాల్లో వర్షపునీరు నిలిచింది.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



అడిగుప్ప పాఠశాలకు దాతలు అందించిన ఫర్నీచర్స్

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వపు విద్యార్థులు చిన్నయ్య, ఓబులేశు, సులోచన టేబుల్, 10 కుర్చీలు వితరణ చేశారు. పాఠశాలకు రాయదుర్గానికి చెందిన దొంతి రజని కుమారి కుమార్తెలు పద్మ,పరిమిళ,రమ్య,చందన రూ.15 వేల విలువ చేసే మైక్‌సిస్టం అందించినట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిప్పాచారి, చంద్రశేఖర్, సాయిరాం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటాల వితరణ



ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలను అందజేస్తున్న కానిస్టేబుల్ నరేంద్ర

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలను హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబ సభ్యులు శనివారం వితరణ చేశారు. సీతా, రామ, లక్ష్మణ, హనుమ విగ్రహాలకు అరకిలో వెండి విగ్రహాలను ఆలయంలో అర్చకులు, అధికారులు అందజేశారు.

కల్తీకల్లు దుకాణాలను సీజ్ చేయాలి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో విచ్చలవిడిగా తయారవుతున్న కల్తీ కల్లు దుకాణాలపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ గౌని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సరిహద్దు రాయదుర్గం ప్రాంతంలో కల్తీకల్లు తయారు చేసి కర్ణాటకకు తరలిస్తూ అక్కడి ప్రజల ప్రాణాల హరిస్తున్నట్లు కర్ణాటకలోని సండూరు ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారని, దీనిపై ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చర్యలు తీసుకోవడంలేదని అన్నారు.

ఊరిస్తున్న ఉచితం.. ప్రయాణం సంకటం

మహిళల ఉచిత బస్సు పథకానికి బస్సులు కరువు

- గ్రామీణ ప్రాంతాలకు నడవని ఆర్టీసీ సర్వీసులు
- ఆటోలు, ప్రైవేట్ వాహనాలే దిక్కు
- పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు



ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో షేక్షానుపల్లి నుంచి పరిమితికి మంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో



పాల్తూరు నుంచి ఉరవకొండ కు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న దృశ్యం

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు తాము అధికారంలోకొస్తే సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన స్త్రీశక్తి పథకం పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఊరూరా ఊదరగొట్టారు. గ్రామాలకు బస్సు సర్వీసులు నడవక చాలా ప్రాంతాల్లో అతికష్టమ్మీద ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో గమ్యస్థానాలు చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. 'ఉచితం' దేవుడెరుగు... అసలు పల్లెలకు బస్సులే లేవు.. ఇక ప్రయాణమెలా? అని మహిళలు నిట్టూరుస్తున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 80 శాతం గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు లేవు. కొన్ని చోట్ల ఉన్నా అవి సమయపాలన పాటించడం లేదు. ఫలితంగా అధిక శాతం గ్రామీణ ప్రజలు ఆటోలు... ప్రైవేట్ వాహనాల పైనే ఆధారపడుతున్నారు.

ప్రచారమే తప్ప ఏమీలేదు:
మహిళలలకు ఉచిత ప్రయాణం పేరుతో కూటమి ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. కానీ పల్లెలకు ఒక్కటంటే ఒక్క సర్వీసూ నడపలేదు. వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు రావాలంటే ప్రైవేట్ ఆటోల్లో అధిక చార్జీలు చెల్లించాలి. ఎప్పుడో ఒకసారి వచ్చే ప్రైవేట్ వాహనాల కోసం గంటల తరబడి వేచి చూడాలి.

ఆర్టీసీ బస్సు నడపాలి



ఉచిత బస్సు కన్నా మా గ్రామానికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సు నడపాలి. ఎన్నో ఏళ్లు ఆటోలపై ఆధారపడి బతుకుతున్నాం. అత్యవసరార సమయాల్లో ఉరవకొండ, అనంతపురం చేరుకోవాలంటే నరక యాతన అనుభిస్తున్నాం. – సుల్తానా, షేక్షానుపల్లి గ్రామం

విద్యార్థులు, రోగుల అవస్థలు

గ్రామాలకు బస్సులు వెళ్లకపోవడంతో ఉరవకొండ, గుంతకల్లు, అనంతపురంలో చదువుతున్న విద్యార్థులు కాలేజీలకు సమయానికి చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. రవాణా సౌకర్యం లేక రోజూ ఆలస్యంగా విద్యాసంస్థలకు చేరుకుంటున్నారు. గ్రామాలకు నుంచి ఉరవకొండ, అనంతపురం లాంటి ప్రాంతాల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. సమయానికి ఆటోలు దొరక్క దిక్కు తోచని స్థితిలో ఉండాల్సి వస్తోంది.

ఉరవకొండ నియోజకరవ్గంలో బస్సు సేవలు లేని గ్రామాలు

మండలం	గ్రామాలు
ఉరవకొండ	వెలిగొండ, బూదగవి, షేక్షానుపల్లి లత్తవరం, లత్తవరంతండా, కోనాపురం, రాచెర్ల, రాయంపల్లి, నెరిమెట్ల,
వజ్రకరూర్	కమలపాడు, గంజికుంట, తట్రకల్లు ఎన్‌ఎన్‌పీతండా, జరుట్లరాంపురం కడమలకుంట, చిన్నహోతూరు గడేహోతూరు, ఛాయపురం
కూడేరు	కరుట్లపల్లి, పి.నారాయణపురం కొర్రకోడు, అరవకూరు, కమ్మూరు
బెళుగుప్ప	జీడిపల్లి, శ్రీరంగాపురం, బూదవర్తి
విడపనకల్లు	వి.కొత్తకోట, పెద్దకొట్టాలపల్లి, హావళిగి కరకముక్కల, పేల్పుమడుగు, పొలికి జనార్దనపల్లి, చాబాల, మల్లాపురం

ఉరవకొండ ఆర్టీసీ డిపోలో మొత్తం సర్వీసులు	60
డిపో నుంచి రోజుకు ప్రయాణించే కిలో మీటర్లు	23,000
డిపో నుండి రోజు ఇతర ప్రాంతాలకు ప్రయాణికులు	7,000
రోజుకు ఆర్టీసీ ఆదాయం	రూ.9 లక్షలు



ఉరవకొండ ఆర్టీసీ బస్సు డిపో

మభ్య పెడుతున్నారు..



మండలంలో దాదాపు 80 శాతం గ్రామాలకు బస్సులు లేవు. ఆటోల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఎన్నో సార్లు గ్రామాలకు బస్సులు నడాపాలని అధికారులకు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు.
– ఫైరోజాబాను, వజ్రకరూరు

గ్రామాలకు బస్సులు నడపాలి



కూటమి ప్రభుత్వం ఉచిత బస్సులంటూ ఆర్భాటం చేయడం కాదు.. ముందు గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలి. 80 శాతం గ్రామాలకు బస్సులు రాక ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సీఎం చంద్రబాబుకు ఈవిషయం కనిపించకపోవడం దారుణం. – ఏసీ పార్వతమ్మ, జెడ్పీటీసీ, ఉరవకొండ

గోపులాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



ధనుంజయ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ గోపులాపురం వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ ధనుంజయ్య (30) శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఇటీవల ధనుంజయ సొంత పనినిమిత్తం గోపులాపురం నుంచి కణేకల్లుక్రాస్‌లో స్కూటీలో వెళ్తుండగా, మార్గంమధ్యలో అదుపు తప్పి కింద పడ్డారు. తలకు బలమైన గాయాలు కావడంతో అతన్ని బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, సర్పంచు ప్రకాష్‌చౌదరి, వైస్ సర్పంచు గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, రాయదుర్గం జెడ్పీ సభ్యులు మల్లిఖార్జున తదితరులు ధనుంజయ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పూలచెర్ల సర్పంచు బోయ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిప్రకాష్‌రెడ్డి, బోయ నాగరాజు, కాంట్రాక్టర్ రవి ధనుంజయకు నివాళులర్పించారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: 79వ స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగాఉత్తమ సేవా అవార్డులు అందుకున్న వారికి దళిత జన జాగృతి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. స్థానిక కార్యాలయంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది మూర్తి, డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోనంపల్లి మోహన్‌ను జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌కే రాజు, జీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పేస్వామి నాయక్, నారాయణపురం ఎంపీటీసీ సతీష్, నాగేంద్రలు దుశ్శాలువాలతో సత్కరించారు.

వైభవంగా విప్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకీసేవ



స్వామి వారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రావణ శనివారం సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో లక్ష్మీసమేత స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకులపూజ, నైవేద్య పూజలు జరిపించారు. దాతలు రాతిబావివంక నరసింహశెట్టి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాళ్లు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, నియోజవర్గం మహిళా నాయకురాలు నాగలక్ష్మి విమర్శించారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గానికి చెందిన గర్భిణి శ్రావణి ఆత్మహత్యకు కారుకులను పోలీసులు ఇంత వరకూ అరెస్టు చేయకపోవడం దారుణమన్నా రు. పోలీసులు, టీడీపీ నేతలు న్యాయం చేయకపోవడంతోనే శ్రావణి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్య చేసుకొని మూడు రోజులు గడుస్తున్నా పోలీసులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిందితులు టీడీపీకి చెందినవారు కావడంతో పోలీసులు కేసు తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. నియోజవర్గ ప్రజలు పోలీసుల తీరును తప్పుపడుతున్నారన్నారు. శ్రావణి ఆడియో రికార్డులో తన ఆత్మహత్యకు కారుకుల పేర్లు తెలిపిందని, వేంటనే వారిని పోలీసులు అరెస్టు చేయాలి డిమాండ్ చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే ధర్నా నిర్వహిస్తామన్నారు. వైస్ ఎంపీపీ కాంతమ్మ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి రిజ్వాన, శెట్టూరు అధ్యక్షురాలు మంజులమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం పూజలు చేశారు. శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అర్చకు లు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



కూడేరు:మండలంలోని కరుట్లపల్లిలో ట్రాన్స్‌కో ఉద్యోగి ధనుంజయ-జ్యోత్స్న ఇంట్లో శనివారం వేకువజామున బ్రహ్మకమలాలు విరబూశాయి. సువాసనను వెదజల్లుతున్న బ్రహ్మ కమలాలను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు బ్రహ్మకమలాలకు పూజలు చేశారు.

భక్తులతో పోటెత్తిన నేమకల్లు

- నేడు నేమకల్లు ఆంజనేయస్వామి రథోత్సవం



స్వామి దర్శనం కోసం ఆలయంలో క్యూ కట్టిన భక్తులు



అలంకరణలో నేమకల్లు, బసాపురం ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రత్యేక పుష్పా అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు వైద్యం అనీల్‌కుమార్ చార్యులు ఆధ్వర్యంలో స్వామికి పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ చేశారు. ఆకుపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, మహామంగళహారతి , ప్రసాద వినియోగాలు నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి హనుమాన్ దర్శన్ బస్సులు ద్వారా, ప్రత్యేక వాహనాలు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గ్రేట్ ఇండియా మైనింగ్ వారు అన్నదానం చేశారు. ఆలయ ఈవో నరసింహారెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు శ్రీవారి ఉత్సవం, బ్రహ్మ రథోత్సవం: నేమకల్లు ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు శ్రీవారి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు నూతన బ్రహ్మ రథోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం 7 గంటలకు లంకాదహనం ఉంటుందన్నారు. శ్రీవారి ఉత్సవానికి, బ్రహ్మరథోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

మార్మోగిన ఆంజనేయుని నామస్మరణ
కూడేరు: ప్రసిద్ధిచెందిన బసాపురం, కూడేరు ఆంజనేయ స్వామి దేవాలయాలకు శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో ఆంజనేయుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- రాయదుర్గంలో ఆకట్టుకున్న ఉట్టి ఉత్సవం



రాయదుర్గంలో వేణుగోపాలస్వామి ఊరేగింపు



ముప్పలకుంట, ఒంటిమిద్దిలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు



అంకంపల్లి, యర్రంపల్లిలో అలంకరణలో కృష్ణుడు



రాయదుర్గం సంతానవేణుగోపాలస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మెట్టు పూజలు



భగవద్గీత ప్రాముఖ్యతను వివరిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి

రాయదుర్గం/కళ్యాణదుర్గం/ఉరవకొండ

సాక్షి బృందం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్త బృందం భగవద్గీత, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రముల పారాయణం, కృష్ణనామ సంకీర్తనలు ఆలపించారు. చాలాచోట్ల పల్లకీసేవ, ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. అన్నప్రసాద వినియోగం చేశారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో శనివారం శ్రీకష్టాష్టమి వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు మిన్నంటాయి. ఆలయంలో రుక్మిణీ, సత్యభామ దేవేరులతో సంతాన వేణుగోపాలస్వామికి సంకల్ప ఫల పంచామృతాభిషేకం, వేణుగోపాల స్వామి భక్తబృందంతో శ్రీమత్ భగవద్గీత, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రముల పారాయణం, కృష్ణనామ సంకీర్తనల ఆలాపన జరిగింది. ఉదయం ఉత్సవ విగ్రహ ఊరేగింపు, మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం, సాయంత్రం శ్రీవారి ప్రాకారోత్సవం, పల్లకీసేవ జరిగింది. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు హాజరయ్యారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, నాయకులు గంగాధర్, బంగి రమేష్ హాజరయ్యారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిరంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల గోపికలు, కృష్ణుల వేషధారణ, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల కమిటీ అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున, కార్యదర్శి సోమానీలకంఠ, హెచ్‌ఎం రాజేశ్వరీ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాయి రాజశేఖర్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు మహబూబ్‌బాషా, వెంకటేశులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు,యర్రంపల్లి, భూపసముద్రం, తాళ్లకెర, కోనాపురం, దేవరెడ్డిపల్లి, పూలకుంట,75 వీరాపురం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను యాదవులు ఘనంగా నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. శ్రీధరఘట్ట , ఎల్‌బీ నగర్, రంగాపురం క్యాంపు, ఉద్దేహాళ్, తిమ్మలాపురం, దేవగిరి క్రాస్ పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీధరఘట్ట దత్తాశ్రమయంలోనూ కృష్ణష్టమి వేడుకలు నిర్వహించారు. లింగదహాళ్‌లో శ్రీకృష్ణుడికి పూజలు చేశారు.

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఫంక్షన్ హాలులో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. మొదటి బహుమతి సమీర్, ద్వితీయ బహుమతి యశ్విత, కృష్ణుని వేషధారులు మణిదీప్, అమృత, షణ్ముఖ, కుందనలకు బహుమతులు బి.ప్రభంజన్‌రెడ్డి, స్వరూప అందించారు.

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్ సమీపంలోని గోపాల కృష్ణ ఆలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. విశేష అలంకరణ, గోపూజ, గణపతి పూజ, ఫల పంచామృత అభిషేకాలు, అర్చనలు, మంత్రపుష్పం, మహా మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమానికి గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి హాజరయ్యారు. యాదవ సంఘం నాయకులు టి.గణేష్ బాబు, కృష్ణ ఆలయ కమీటి సభ్యులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పందికుంటలో యాదవుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని గ్రామాల్లో శ్రీకృష్ణ ఆలయాలు, మందిరాలు, పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. అంకంపల్లిలోని శ్రీకృష్ణ ఆలయంలో పంచామృతాభిషేకం, పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. అంకంపల్లి, గంగవరం, దుద్దేకుంట, రామసాగరం, నర సాపురం గొల్లలదొడ్డిలో యాదవులు వేడుకలు నిర్వహించారు.



పందికుంటలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని శ్రీకృష్ణమందిరం, దొడగట్ట, ఒంటిమిద్ది గ్రామంలో శనివారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు గోపికల వేషధారణలో అలరించారు. భక్తులు ఉదయం నుంచి చిన్ని కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా తిప్పయ్యదొడ్డి, భైరసముద్రం, అజ్జయ్యదొడ్డి, ముప్పలకుంట గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం నిర్వహించారు.

కుందుర్పి: మండలంలోని నిజవల్లి,మహంతపురం, జంబుగంపల,తూముకుంట, బెస్తరపల్లి గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నిజవల్లి, మహంతపురం గ్రామాల్లో ప్రత్యేకంగా నిర్మించిన కృష్ణదేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.





కణేకల్లు, రాయదుర్గం సరస్వతీ శిశుమందిరంలో చిన్నారుల శ్రీకృష్ణుని, గోపికల వేషధారణ





దొడగట్టలో ముస్తాబైన శ్రీకృష్ణుడు, లింగదహాళ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం